క్లుప్తంగా

కొలువు దీరిన జాతర పీర్లు



చౌటిపల్లెలో కొలువు దీరిన జాతర పీర్లు

కొండాపురం : మండలంలోని చౌటిపల్లె పునరావాస కాలనీలో శనివారం జాతర పీర్లు కొలువు దీరాయి. కులమతాలకు అతీతంగా జాతర పీర్లపండుగ జరుపుకుంటామని గ్రామస్తులు తెలిపారు. ఆదివారం గుండంలోకి జాతర పీర్లు ప్రవేశిస్తాయన్నారు. భక్తులు పాల్గొని తమ ముక్కుబడులు చెల్లించుకుంటారన్నారు. సోమవారం ఏటికి వెళ్తాయన్నారు.

ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు

జమ్మలమడుగు : కార్పొరేట్ పాఠశాలల్లో ఒలంపియాడ్, ఐఐటీ క్లాసులంటూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యంపై చర్యలను తీసుకోవాలని రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ నాయకుడు జగన్ తెలిపారు. శనివార స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లాలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని కార్పొరేట్ యాజమాన్యం సొంత భవనాలు లేకుండా అపార్టుమెంట్, షాపింగ్ కాంప్లెక్స్, కల్యాణ మండపాలలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తరగతులను నిర్వహిస్తున్నారన్నారు. క్వాలిఫైడ్ టీచర్లతో బోధన చేయించడంలేదన్నారు.

నేడు చౌడేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు



చౌడేశ్వరి అమ్మవారు

సింహాద్రిపురం : మండలంలోని బొజ్జాయిపల్లెలో ఆదివారం చౌడేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. అమ్మవారి పుట్టిన రోజు పురస్కరించుకుని ఆదివారం ఉదయం నుంచి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

తాగునీటి సరఫరా లేక ఇక్కట్లు

ముద్దనూరు : స్థానిక బాలుర ఉన్నతపాఠశాల వీధి, కొత్తకొట్టాల పరిసరప్రాంతాల్లో 3 రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై అధికారులకు ఫిర్యాదు చేసినట్లు ఆ ప్రాంత వాసులు తెలిపారు.పైప్‌లైన్‌లో మరమ్మతులు చేపట్టకపోవడంతోనే తాగునీటి సరఫరాకు ఇబ్బంది ఏర్పడినట్లు స్థానికులు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి

పెండ్లిమర్రి : సీజనల్ వ్యాధులపై స్వయం సహాయక సంఘాల సభ్యులు అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శనివారం స్వయం సహాయక గ్రామ సంఘాల సభ్యులు, హెల్త్ సబ్ కమిటీ సభ్యులకు శనివారం శిక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం ఆరోగ్యం, పోషణ, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీపీఎంయూ మాధవి, ఏపీఎంలు పాల్గొన్నారు.

ఎద్దుల ఈశ్వరరెడ్డికి ఘన నివాళి



ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

జమ్మలమడుగు : స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ కడప పార్లమెంట్ సభ్యుడు ఎద్దుల ఈశ్వరరెడ్డి 38వ వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పాతబస్టాండ్‌లో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ నారాయణరెడ్డి మాట్లాడుతూ భూస్వామిగా ఉన్న ఎద్దుల ఈశ్వరరెడ్డి తన ఆస్తులన్నీ నిరుపేదలకోసం, పార్టీ కోసం స్వచ్ఛందంగా ఖర్చుచేశారన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకుడు మిడుతూరు ప్రసాద్, ఎద్దుల ఈశ్వరరెడ్డి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పతనమైన చీనీ ధరలు

- తెగుళ్లతో తగ్గిన చీనీ దిగుబడులు
- ఆందోళనలో చీనీ రైతులు



ఎగుమతులు చేస్తున్న చీనీకాయలు



తెగుళ్లు సోకిన చీనీచెట్టు

సింహాద్రిపురం : రాష్ట్రంలో చీనీ సాగుకు సింహాద్రిపురం మండలం ప్రసిద్ధి. చీనీ ఎగుమతిలో మొదటి స్థానంలో ఉండగా... చీనీ దిగుబడిలోనూ, నాణ్యమైన చీనీ అంట్లు అమ్మకాలలో సింహాద్రిపురం మొదటి స్థానంలో ఉంది. మండల వ్యాప్తంగా 18 వేల ఎకరాలలో చీనీ పంటను రైతులు సాగు చేశారు. అందుకు అనుగుణంగా గత వైఎస్సార్ ప్రభుత్వం పులివెందులలోనే షూట్ లేకుండా చీనీకాయలు అమ్మకాలు చేసేందుకు మార్కెట్ ఏర్పాటు చేసింది. అంతేకాకుండా అనంతపురం నుంచి ఢిల్లీకి నేరుగా ఎగుమతుల కోసం రైళ్లను కూడా ఏర్పాటు చేశారు. అయితే ఈ ఏడాది జూన్, జూలై నెలల్లో వర్షాలు లేక ఎండ వేడిమితో చీనీ చెట్లకు బంక తెగులు, వేరుకుళ్లు తెగుళ్లతో చీనీలో దిగుబడులు తగ్గి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మరోపక్క చీనీ ధరలు పతనం కావడంతో రైతులు కుదేలవుతున్నారు. గత ఏడాది టన్ను చీనీ ధర రూ.75వేలు పలుకగా... ఈ ఏడాది రూ.30 వేలు ఉండటంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

చీనీ రైతులను ఆదుకోవాలి



ఈ ఏడాది వర్ష ప్రభావం తక్కువగా ఉండటంతో ఎండ తీవ్రతకు చీనీచెట్లకు తెగులు సోకి చనిపోతున్నాయి. చాలా రైతుల పొలాల్లో ఇదే పరిస్థితి. దీనికి తోడు చీనీకాయల ధరలు పతనమయ్యాయి. ప్రభుత్వం వెంటనే దెబ్బతిన్న చీనీ రైతులను ఆదుకోవాలి. అలాగే అనంతపురం నుంచి ఢిల్లీకి ఎగుమతుల కొరకు వారంలో ఒకసారి ప్రత్యేక రైలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నా.

– అరవిందనాథరెడ్డి, రైతు, సింహాద్రిపురం

తెగుళ్లతో అన్నీ కష్టాలే



చీనీ రైతులను కష్టాలు వెంటాడుతున్నాయి. ఒకపక్క చీనీ చెట్లకు తెగుళ్లు, మరోపక్క చీనీ ధరలు పతనం. ఎంతో కష్టపడి కన్నబిడ్డల్లా పెంచుకున్న చీనీచెట్లు కళ్లముందర చనిపోతూ ఉంటే బాధగా ఉంది. చీనీ రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలి.

– కమ్మం మహేశ్వర్‌రెడ్డి, రైతు, సింహాద్రిపురం

నిందితుడి అరెస్టు



నిందితుడి అరెస్టు వివరాలను తెలుపుతున్న సీఐ నారాయణ యాదవ్

వల్లూరు (చెన్నూరు) : కడప నగరం నబీకోట్‌కు చెందిన సాన రామమోహన్‌రెడ్డిని శనివారం అరెస్టు చేసి రూ.7 వేల నగదు, ఇతర పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు చెన్నూరు సీఐ నారాయణ యాదవ్ తెలిపారు. వడ్డీ డబ్బుల విషయంలో అవమానించడంతో ఆత్మహత్య చేసుకున్న శివనాథరెడ్డి కేసులో రామమోహన్‌రెడ్డిని అరెస్టు చేశామని ఆయన తెలిపారు. నిందితుడి నుంచి ఈ సందర్భంగా ఫోన్ పే జిరాక్స్ కాపీలు, మూడు ప్రామిసరి బాండ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిని రిమాండుకు తరలించామని సీఐ తెలిపారు.

మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న పీఆర్ఎస్‌వైఎఫ్ నాయకులు, విద్యార్థులు

పులివెందుల టౌన్ : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని పునః ప్రారంభించాలని పీఆర్ఎస్‌వైఎఫ్ ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం పునఃప్రారంభించాలని వారు డిమాండ్ చేశారు. పీఆర్ఎస్‌వైఎఫ్ జిల్లా కన్వీనర్ నాగేంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 472 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు నడుస్తున్నాయని, విద్యార్థులు గ్రామాల నుంచి కళాశాలకు రావడంతో మధ్యాహ్న భోజనం ఇబ్బంది కరంగా ఉందన్నారు. జూనియర్ కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు తిరిగి మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించాలని కోరారు. లేనిపక్షంలో విద్యార్థులను కలుపుకుని ఆందోళనను ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు వెంకటరమణ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు

వీరపునాయునిపల్లె : రైతులు సాగు చేసిన పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టడం వలన అధిక దిగుబడి సాధించవచ్చునని మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు తెలిపారు. శనివారం ఎస్.పాలగిరి గ్రామంలో సాగుచేసిన పత్తిపంట, వేరుశనగ పంటను ఆయన పరిశీలించి మాట్లాడారు. మండలంలో వర్షాధారం కింద వేరుశనగ పంటను సాగు చేశారన్నారు. పత్తి పంటలో రసం పీల్చే పురుగుల ఉధృతి ఎక్కువగా ఉందన్నారు. పచ్చదోమ, తెల్ల దోమ, తామర పురుగుల నివారణకు చర్యలు తీసుకోవాలని రైతులకు సూచించారు. పత్తి పంటలో గులాబిరంగు పురుగులు ఆశించకుండా ఉండేందుకు లింగాకర్షణ బుట్టలను ఏర్పాటు చేయించామన్నారు. అలా చేయడం వలన పురుగు మందుల ఖర్చులు తగ్గడమే కాకుండా పర్యావరణానికి మేలు చేసినట్లవుతుందన్నారు. ప్రస్తుతం సాగులో ఉన్న వేరుశనగ పంట వర్షాభావ పరిస్థితులు ఏర్పడటం వలన బెట్టకు గురవుతోందని బెట్టనుంచి కాపాడుకొనేందుకు లీటరు నీటికి 20 గ్రాములు యూరియా లేదా లీటరు నీటికి 19:19:19 5 గ్రాములు చొప్పున కలిపి పంటపై పిచికారి చేయాలన్నారు. 10 రోజుల పాటు వేరుశనగ పంటను బెట్ట నుంచి కాపాడుకోవచ్చునన్నారు. వర్షాభావ పరిస్థితుల వలన పంటలు దెబ్బతింటున్న విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



మాట్లాడుతున్న జడ్జి ఎస్.భార్గవి

జమ్మలమడుగు రూరల్ : ప్రభుత్వం అందిస్తున్న మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని జమ్మలమడుగు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎస్.భార్గవి తెలిపారు. శనివారం మండలంలోని గూడెంచెరువు గ్రామంలోని ఎంపీపీ పాఠశాలను ఆమె సందర్శించి భోజనాన్ని పరిశీలించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని వారికి మధ్యాహ్న భోజనం, యూనిఫాం, బోధన పుస్తకాలను అందజేసిందన్నారు. కష్టపడి తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తీసుకునిరావాలని విద్యార్థులకు తెలిపారు. అనంతరం గ్రామంలోని జ్యోతి మనో వికాస కేంద్రాన్ని ఆమె సందర్శించి న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాదులు మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మానవీయ విలువలు అలవరచుకోండి



బహుమతులు అందుకున్న విద్యార్థులతో మానవత సంస్థ ప్రతినిధులు

పులివెందుల టౌన్ : విద్యార్థులు మానవీయ విలువలు అలవరచుకోవాలని మానవత చైర్మన్ డి.వి. కొండారెడ్డి తెలిపారు. శనివారం నల్లపురెడ్డిపల్లె ఉన్నత పాఠశాలలో మానవీయ విలువలపై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థి స్థాయిలో మానవీయ, నైతిక విలువలు అలవరచుకుని మంచి మార్గంలో నడిచి గురువులకు, తల్లిదండ్రులకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం విద్యార్థులకు నైతిక విలువలు అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ రీజియన్ కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి, మానవత కన్వీనర్ బీవీ కృష్ణారెడ్డి, అధ్యక్ష, కార్యదర్శులు జయరాజు, గంగిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు కమలానంద శర్మ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో వర్షాలు కురవాలని

విరాట పర్వపఠనం





విరాట పర్వ పఠనం చదువుతున్న చంద్రశేఖర్‌రెడ్డి, హాజరైన వక్తలు, భక్తులు

పులివెందుల టౌన్ : స్థానిక శ్రీపద్మావతి సమేత వేంకటరమణస్వామి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం విరాట పర్వ పఠనం నిర్వహించారు.

సకాలంలో వర్షాలు కురవాలని గత నెల 6వ తేదీ నుంచి ఆగస్టు 4వ తేదీ వరకు విరాటపర్వ పఠనం నిర్వహిస్తున్నట్లు పులివెందుల శ్రీమద్భాగవత ధర్మప్రచార ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. విరాటపర్వ పఠనం వల్ల సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలు పండి రైతులు, ప్రజలు సుభిక్షంగా ఉంటారని వారు తెలిపారు. ఆదివారం విరాటపర్వం చివరి ఘట్టంతో ముగియనున్నదన్నారు. రిటైర్డ్ అధ్యాపకులు చంద్రశేఖర్‌రెడ్డి, పలువురు వక్తలు విరాట పర్వం చదివి వినిపించారు.

నవజాత శిశువుకు తల్లిపాలే అమృతం



వేంపల్లె : తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ షఫీఉన్నీసా



పులివెందుల : నల్లపురెడ్డిపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న తదితరులు



కొండాపురం : ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

వేంపల్లె : నవజాత శిశువులకు తల్లిపాలే అమృతమని తాళ్లపల్లి పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ షఫీఉన్నీసా భేగం తెలిపారు. శనివారం మండలంలోని తాళ్లపల్లి గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపే ముర్రుపాలు పట్టించాలని, అన్ని రకాల పోషక విలువలు కలిగి వ్యాధి నిరోధక శక్తిని కలిగి ఉంటుందన్నారు. తల్లికి రొమ్ము క్యాన్సర్, గర్భాశయ కేన్సర్ రాకుండా నివారిస్తుందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగరత్న, వెంకటలక్ష్మి, సీహెచ్‌ఓ వెంకటరత్నం, ఏఎన్ఎం అరుణ, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

కొండాపురంలో..

కొండాపురం : మండలంలోని యనమలచింతల, వెంకయ్యకాలువ, బుక్కపట్నం, యర్రగుడి, బొమ్మేపల్లె అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలతో కలసి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.భారతి ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. బిడ్డకు ముర్రుపాలు పట్టడంవల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు

పులివెందులలో..

పులివెందుల రూరల్ : మండలంలోని నల్లపురెడ్డిపల్లెలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా తల్లులకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాబున్ని అవగాహన కల్పించారు. వారం రోజుల పాటు నిర్వహించే తల్లిపాల వారోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ విజయభారతి, తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : మండలంలోని బి.చెర్లోపల్లి, వై.కొత్తపల్లి, బొజ్జాయిపల్లి, కోవరంగుట్టపల్లి, పైడిపాలెం, చవ్వారిపల్లె గ్రామాల్లోని ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, గ్రామాల సచివాలయ ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

తొండూరులో..

తొండూరు : మల్లేల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు, బాలింతలకు, వైద్య సిబ్బందికి తల్లిపాలపై సీడీపీఓ శ్రీలత అవగాహన కల్పించారు. తల్లిపాలు తాగడం వల్ల ఆ పిల్లలకు వ్యాధులు రాకుండా ఉంటాయన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రవణమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ శశికళ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

డీఎస్పీకి సన్మానం



డీఎస్పీని సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, తదితరులు

పులివెందుల : పులివెందుల నూతన డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన బుక్కే మురళీనాయక్‌ను ఆయన కార్యాలయంలో శనివారం మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హఫీజ్‌లు సన్మానించారు. కార్యక్రమంలో కోఆప్షన్ మెంబర్ చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

లింగాల : మండలంలోని 33 కేవీ మురారిచింతల ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ బాలసంజీవులు తెలిపారు. రైతులు, ప్రజలు సహకరించాలని వారు కోరారు.

భవన నిర్మాణం కోసం విరాళం



రాజుకు విరాళం అందజేస్తున్న హెచ్ఎం శ్రీనివాసులురెడ్డి

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్నేహిత అమృతహస్తం సేవాసమితి నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వ ఉన్నత పాఠశాల మెయిన్ ఉపాధ్యాయ బృందం రూ.15 వేలు విరాళం అందజేశారు. హెచ్ఎం శ్రీనివాసులు రెడ్డి చేతుల మీదుగా నగదును సేవాసమితి అధ్యక్షుడు రాజుకు అందజేశారు.

ఎర్రచందనం జోలికి వెళితే తాట తీస్తాం

– మైదుకూరు డీఎస్పీ టి.వెంకటేశులు

మైదుకూరు : ఎర్రచందనం అక్రమ రవాణా చేయాలని చూస్తే తాట తీస్తామని మైదుకూరు డీఎస్పీ టి.వెంకటేశులు హెచ్చరించారు. శనివారం మైదుకూరు పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయంలో మైదుకూరు, బద్వేలు నియోజకవర్గాల్లోని ఎర్రచందనం కేసుల్లో ఉన్న 163 మందికి ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎర్రచందనం అక్రమ రవాణాతో జీవితాలను నాశనం చేసుకోవద్దని అన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడితే కేసులు నమోదు చేయడమేగాక పీడీ యాక్ట్ కూడా అమలు చేస్తామని హెచ్చరించారు. ఎర్రచందనం అక్రమ రవాణాకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సబ్ డివిజన్‌లోని పోలీసు అధికారులు పాల్గొన్నారు.

అధైర్యపడవద్దు అండగా ఉంటా



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అధైర్యపడవద్దు అండగా ఉంటానని కమలాపురం మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని ఎస్.పాలగిరి పంచాయతీలో పార్టీ కార్యకర్తలతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అధికార పార్టీ నుంచి కార్యకర్తలకు ఎటువంటి సమస్యలు ఎదురైనా వెంటనే నా దృష్టికి తీసుకురావాలని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రఘునాథ్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నివాళి

వల్లూరు (చెన్నూరు) : చెన్నూరుకు చెందిన వైఎస్సార్ సీపీ మైనార్టీ నాయకుడు, మాజీ ఉప సర్పంచ్ కరీముల్లాకు మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి నివాళులర్పించారు. కరీముల్లా మృతి సమాచారం తెలుసుకున్న ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించడంతోపాటు మృతదేహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరామర్శ

పెండ్లిమర్రి : మండలంలోని కారపురెడ్డిపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ ఓబుల్‌రెడ్డి అనారోగ్య కారణంగా కడప నగరంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి శనివారం ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఈశ్వర్‌రెడ్డి, రాజారెడ్డి పాల్గొన్నారు.

నేడు చౌడేశ్వరిదేవి జయంతి ఉత్సవాలు





సుబ్బిరెడ్డి కొట్టాలు చౌడేశ్వరిదేవి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సెట్టింగ్, ఆలయం వద్ద ఏర్పాటు చేసిన క్యూలైన్

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణంలోని పలు చౌడేశ్వరిదేవి ఆలయాల్లో చౌడేశ్వరిదేవి జయంతి ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. రామేశ్వరం మోరీల వద్ద ఉన్న చౌడేశ్వరిదేవాలయం, ఆర్టీపీపీ రోడ్డులోని అష్టభుజ మహాచౌడేశ్వరిదేవి, వసంతపేట, సుబ్బిరెడ్డికొట్టాల, పప్పుల బజార్, వినాయకనగర్, ఆచార్లకాలనీ, విజయనగరం వీధితోపాటు అన్ని చౌడేశ్వరిదేవి ఆలయాల్లో ఉదయం అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేయనున్నారు. కొన్ని ఆలయాల్లో మధ్యాహ్నం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీ దృష్ట్యా బారికేడ్లను ఏర్పాటు చేశారు. అమ్మవారి జయంతి వేడుకలను పురస్కరించుకుని ఆలయాలకు రంగులు వేయించడంతోపాటు విద్యుత్ దీపాలతో అలంకరించారు. చలువపందిళ్లను ఆలయాల ముంగిళ్లలో ఏర్పాటు చేశారు. కొందరు ఆలయాల నిర్వాహకులు రాత్రి అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. పట్టణంలో సుమారు 18పైగా చౌడేశ్వరి దేవి ఆలయాలు ఉన్నాయి. చేనేత కులాలవారితోపాటు అందరూ అమ్మవారిని ఆరాధ్య దైవంగా కొలుస్తున్నారు. జయంతి ఉత్సవాల్లో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని అన్న ప్రసాదాలను స్వీకరించాలని ఆలయాల నిర్వాహకులు కోరారు.

జీవన ఎరువులతో నాణ్యమైన మిరప పంట

మైదుకూరు : జీవన ఎరువులతో నాణ్యమైన మిరప పంటను పండించవచ్చని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ కరుణశ్రీ అన్నారు. మండలంలోని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రంలో శనివారం మిరప సాగుపై జిల్లా స్థాయి రెండో రోజు కార్యక్రమానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కరుణశ్రీ మాట్లాడుతూ మిరప సాగులో క్రిమిసంహారక మందులకు బదులుగా జీవన ఎరువులు వినియోగించాలని సూచించారు. దీని వల్ల నాణ్యతతోపాటు అధిక దిగుబడులు కూడా వస్తాయన్నారు. మిరప నాటిన నెల తర్వాత తెగుళ్ల నివారణ కోసం బ్లూ స్టిక్ ట్రాప్ (నీలం కర్ర ఉచ్చు)లను పొలంలో ఏర్పాటు చేయాలని సూచించారు. కేవీకే అధిపతి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ మాట్లాడుతూ మిరప సాగులో యాజమాన్య పద్ధతులను వివరించారు. పులివెందుల అరటి పరిశోధన కేంద్రం కీటక శాస్త్రవిభాగం శాస్త్రవేత్త డాక్టర్ బి.నాగేంద్రారెడ్డి, వనిపెంట కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ ఫిరోరజ్ హుస్సేన్, గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ బీఎస్ కాంతిశ్రీ మిరపలో విలువ జోడింపు గురించి, తెగుళ్లు, చీడపీడల నివారణ గురించి రైతులకు వివరించారు. అనంతరం శాస్త్రవేత్తలు, రైతులు మండలంలోని సుంకులు గారిపల్లె, మాచుగారిపల్లె, మిట్టమానుపల్లె గ్రామాల్లో రైతులు సాగు చేసిన మిరప, ఉల్లి, అరటి, నేల సంపంగి, బంతి తదితర పంటలను సందర్శించి పరిశీలించారు.